www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 28 డిసెంబర్ 2025
5



వైఎస్ఆర్

పరీక్షా పే చర్చలో విరివిగా నమోదు చేయాలి : డిఇఒ

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలోని అన్ని రకాల మేనేజ్మెంట్ల పాఠశాలల విద్యార్థులను ముఖ్యంగా ఆరు నుంచి 12వ తరగతి వారందరిని పరీక్ష పే చర్చ – 2026 కార్యక్రమంలో భాగంగా నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ పిలుపునిచ్చారు. జయ నగర్ కాలనీ పాఠశాల ఆవరణలో శనివారం సిఆర్పిల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో పరీక్షల పై భయం తగ్గించి, ప్రశాంత వాతావరణంలో పరీక్షలను విద్యార్థులు ఎదుర్కొనేలా వారిలో ఆత్మవిశ్వాసం నెలకొల్పాలని పేర్కొన్నారు. దానికి తగిన విధంగా పరీక్షల్లో సమూల మార్పులు కోరుకుంటూ విద్యార్థులు సంధించే ప్రశ్నలకు ప్రధానమంత్రి నేరుగా సమాధానం ఇస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారులు అందరూ విద్యార్థులందరినీ నమోదు చేయించి ఉత్తమ ప్రశ్నలను సంధించి మన జిల్లా అగ్రస్థానంలో ఉండేలా చూడాలని కోరారు.

తర్జన భర్జనలు



రాయచోటిని జిల్లా కేంద్రంగా ఉంచాలంటూ కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న ఆందోళనకారులు

కేబినెట్ సబ్ కమిటీలో జిల్లాల విభజనపై సుదీర్ఘ చర్చ

రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరులపై అస్పష్టత

జిల్లాల స్వరూపం మార్పు దిశగా కసరత్తు

31న తుది గెజిట్ నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాల విభజనపై ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన విజయవాడ కేంద్రంగా కేబినెట్ సబ్ కమిటీ భేటీ అయింది. అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి అసెంబ్లీ కేంద్రాల విభజనపై సుదీర్ఘ కసరత్తు చేసినట్లు సమాచారం. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో అప్పటి కూటమి నాయకుని హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, మదనపల్లి అసెంబ్లీలను కొత్త జిల్లా కేంద్రాలుగా ఏర్పాటు చేస్తామని హామీనిచ్చిన సంగతి తెలిసిందే. ఇటీవల అన్నమయ్య జిల్లాకు చెందిన మదనపల్లి కేంద్రంగా కొత్త జిల్లాను ప్రకటించారు. రాజంపేటను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తామన్న హామీని విస్మరించారు. ఆనాటి నుంచి నేటి వరకు రాజంపేట, రైల్వేకోడూరు అసెంబ్లీల పరిధిలో నిరసనలు, నిరాహార దీక్షల వెల్లువ కొనసాగుతోంది. నిరసనలు, నిరాహార దీక్షల నేపథ్యంలో ప్రభుత్వం పునరాలోచనలో పడినట్లు సమాచారం. ఈ నెల 28న మరోమారు సబ్ కమిటీలో చర్చించి తుది నిర్ణయం తీసుకోనుంది. విభజిత జిల్లాల విభజనపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది.

కడప జిల్లాలోకి రాజంపేట!?

తాజా కేబినెట్ సబ్ కమిటీ భేటీలో రాజంపేట అసెంబ్లీని కడప జిల్లాలో, రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలో, రాయచోటిని మదనపల్లి జిల్లాలో కలిపితే ఎలా ఉంటుందనే కోణంలో చర్చించినట్లు తెలుస్తోంది. తుది నిర్ణయం తీసుకోవడానికి మరో మారు కేబినెట్ సబ్ కమిటీ భేటీయై తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ నెల 29న కేబినెట్‌లో అన్నమయ్య జిల్లా విభజనపై కూలంకషంగా చర్చించి ఆమోదించనున్నట్లు సమాచారం. అనంతరం కేబినెట్ ఆమోదం లభించిన వెంటనే విభజన ప్రక్రియను పూర్తి చేయనుంది. అనంతరం ఈ నెల 31న జిల్లాల విభజనపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

రాయచోటిని జిల్లా కేంద్రంగానే కొనసాగించాలని నిరసన

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటిని అన్నమయ్య జిల్లా కేంద్రంగా కొనసాగించాలని టిడిపి నాయకులు ఆందోళన చేపట్టారు. శనివారం రాత్రి ఆర్టీసి బస్టాండ్ సర్కిల్ వద్ద రాయచోటి జిల్లా తరలింపుపై ప్రభుత్వం పునరాలోచించి రాయచోటినే అన్నమయ్య జిల్లా కేంద్రంగా కొనసాగించాలని ఆందోళన చేపట్టి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాయచోటి జిల్లా కేంద్రంగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం మార్పైతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. త్వరలో బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గాజుల ఖాదర్‌బాషా, రవీంద్రారెడ్డి, సుజాత, జెఎసి నాయకులు, టిడికె కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు ఆందోళన చెందవద్దు : మంత్రి

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి మార్పుపై ఎవరూ ఆందోళన చెందవద్దని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అన్నమయ్య జిల్లా ముక్కలు కాబోతోందనే సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతున్న వార్తలను నమ్మవద్దని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రజల ఆకాంక్షలను అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకొని నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. జిల్లా ముక్కలు కాబోతోందంటూ వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి : 'చమర్తి'

ప్రజాశక్తి - ఒంటిమిట్ట : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత నిస్తూ అధికారులు పనిచేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట వ్యాప్తంగా భూ అక్రమాలపై విచారణ చేసి భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు, రైతులకు సకాలంలో సబ్సిడీ విత్తనాలు అందించి ఆదుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని, కనీస మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం మండల అభివృద్ధికి అధికారులు తెలుగుదేశం పార్టీ నాయకుల సమన్వయంతో కలిసి పని చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

టిడిపి నగర కమిటీకి సన్మానం



నగర కమిటీ సభ్యుల సన్మానిస్తున్న రహమతుల్లా

ప్రజాశక్తి- కడప అర్బన్ : ఎన్ఆర్ఐ రహమాతుల్లా ఆధ్వర్యంలో కడప నగం కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు. శనివారం మార్కెట్ యార్డ్ సమీపంలోని ఎన్ఆర్ఐ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పార్టీ ప్రతిష్ఠతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి తమవంతుగా కృషి చేస్తున్న టిడిపి నగర కమిటీకి తమవంతుగా అండగా నిలబడి సత్కరించాలని నిర్ణయించామని రహమతుల్లా తెలిపారు. కడపలోని టిడిపి ఎన్ఆర్ఐ కార్యాలయంలో పార్టీ నగర కమిటీ అధ్యక్షులు మన్సూర్ అలీఖాన్, ఉపాధ్యక్షులు పసుపులేటి గౌతమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి తోపాటు నగర కమిటీ మొత్తాన్ని ఎన్ఆర్ఐ విభాగం తరుపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రహమతుల్లా మాట్లాడుతూ టిడిపిలో ఉండే సీనియర్లు, జూనియర్లు, కార్యకర్తలు మేమంతా ఒక్కటే అన్న అంశం ప్రజల్లోకి వెళ్లాలని, రాబోయే ఎన్నికల్లో విజయం, ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ ప్రతిష్ట పెంపు చర్యలు చేపడుతూ ప్రజలకు అండగా ఉంటామని సంకేతాలు ఇస్తున్నారన్నారు. చివరగా తనకు జరిగిన సన్మానానికి నగర కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ రాబోయే కాలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాధవి పొలిట్‌బ్యూరో సభ్యులు వాసుల సహకారంతో కడపను టిడిపి అడ్డాగా మార్చేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు.

లైంగిక వేధింపులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : లైంగిక వేధింపులపై అందరూ తప్పక అవగాహన పెంచుకోవాలని సైకాలజిస్ట్ రత్నమ్మ పేర్కొన్నారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్ ఆదేశాల మేరకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'పిల్లలపై లైంగిక దాడి–దుర్వినియోగం–నివారణపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు పిల్లలపై జరిగే మానసిక, శారీరక, లైంగిక, ఆన్‌లైన్ దాడుల గురించి వివరించారు. ఈ పతి నలుగురు అమ్మాయిలలో ఒకరు, ప్రతి ఆరుగురు అబ్బాయిలలో ఒకరు లైంగిక దాడికి గురవుతున్నారని చెప్పారు. ఇలా లైంగిక దాడికి లైంగిక దుర్వినియోగానికి గురైన పిల్లలు చదువులో వెనుకబడటం, మతిమరుపు, భయాందోళనలు వంటి అనేక మానసిక–శారీరక లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. అటువంటి లక్షణాలను ముందుగానే గుర్తించి, వారికి అవసరమైన వైద్య, మానసిక, విద్యా సహాయ సేవలు అందించాల్సిన అవసరాన్ని వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిసి సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, సమాజ ఆరోగ్య అధికారులు, ఆరోగ్య సహాయకులు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ సేవలో నాగభూషణం కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి - బద్వేలు : శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ (అటానమస్) కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ –2 వాలంటీరు వారం రోజుల నుండి బద్వేల్‌లోని అశోక్ నగర్ లో పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టారని కళాశాల పరిపాలన అధికారి రాచపుడి వెంకట సాయి కృష్ణ తెలిపారు. శనివారం అశోక్ నగర్, రజకవీధిలోని ఎంపిపి పాఠశాలలో పరిసరాల శుభ్రతను చేపట్టమని, విద్యార్థుల రక్షణ కోసం పాఠశాల చుట్టూ ఇనుప కంచె వేశామని ఆయన అన్నారు. పాఠశాల గోడలకు విద్యార్థులు రంగులు వేశారని, పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారని, అక్కడి పిల్లలకు పరిశుభ్రత గురించి వివరించారని ఎన్ఎస్ఎస్ యూనిట్–2 ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ లక్ష్మీ దేవి తెలిపారు. కళాశాల విద్యార్థులు చేసిన సేవ కార్యక్రమాల పట్ల పాఠశాల అధ్యాపకులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

డిసిసిఐ అండర్-19 మ్యాచ్‌లో సౌరాష్ట జట్టు విజయం

ప్రజాశక్తి - కడప

స్థానిక వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నాలుగు రోజులుగా నిర్వహించిన డిసిసిఐ అండర్– 19 కూచ్ బెహార్ ట్రోఫీ ప్రీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్రపై 34 పరుగుల తేడాతో సౌరాష్ట్ర జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో సౌరాష్ట్ర జట్టు 286 పరుగులు చేసింది. ఆంధ్ర జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 248 పరుగులు చేసింది. 9 వికెట్ల నష్టానికి 452 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన సౌరాష్ట్ర జట్టు 118.5 ఓవర్లలో 483 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని హర్వాన్స్ సింగ్ 158 ఆర్యన్ 60, పటేల్ 62(నాటౌట్) పరుగులు చేశారు. దీంతో సౌరాష్ట్ర జట్టు 522 పరుగుల విజయ లక్ష్యాన్ని ఆంధ్ర జట్టు ముందుంచింది. 522 పరుగుల విజయ లక్ష్యంతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు 488 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమి చెందింది. ఆ జట్టులోని కె. హనీష్ వీరారెడ్డి బ్యాటింగ్ లో అద్భుతంగా రాణించాడు. 206 బంతులను ఎదుర్కొని 17 బౌండరీలు, 8 సిక్సర్ల సహాయంతో 245 పరుగులు (డబల్ సెంచరీ) చేశాడు. . **ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా హనీష్ వీరారెడ్డి..** నాలుగు రోజులపాటు ఆంధ్ర, సౌరాష్ట్ర జట్ల మధ్య నిర్వహించిన డిసిసి అండర్– 19 కూచ్ బెహార్ ట్రోఫీ ప్రీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టుకు చెందిన కె. హనీష్ వీరారెడ్డి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నాడు. 2వ ఇన్నింగ్స్ లో కె.హనీష్ వీరారెడ్డి బ్యాటింగ్ అద్భుతంగా ప్రదర్శించి 206 బంతులను ఎదుర్కొని 17 బౌండరీలు, ఆరు సిక్సర్ల సహాయంతో 245 పరుగులు (డబల్ సెంచరీ) చేయడంతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా అతనికి జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డి ప్రసాద్ చేతుల మీదుగా అవార్డును అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు

ప్రజాశక్తి - కడప అర్బన్



తనను రెండోసారి కడప పార్లమెంట్ అధికార ప్రతినిధిగా ఎన్నిక చేసిన మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ నాయకులు పుత్తా నరసింహ రెడ్డి, ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు మన్సూరు అక్బర్ పేర్కొన్నారు. టిడిపి ప్రజల గొంతుకై ప్రజా క్షేత్రంలో చేసేందుకు అవకాశం కల్పించి అమోదించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి ధన్యవాదాలు తెలిపారు. కమలాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతానని తెలిపారు. నూతనంగా టిడిపి జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన సి.భూపేష్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

సర్వేపై అవగాహన గ్రామసభ

ప్రజాశక్తి - గోపవరం : మండలంలోని గోపవరం రెవెన్యూ గ్రామానికి సంబంధించి రీ సర్వే అవగాహన గ్రామ సభను శనివారం గోపవరం గ్రామ సచివాలయంలో తహశీల్దార్ త్రిభువన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ,గోపవరం రెవిన్యూ గ్రామంలో రీ సర్వే ప్రక్రియ జనవరి 2 నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. రైతులు ముందుగా తెలియజేసిన తేదీల్లో తమకు సంబంధించిన భూ ఆధార పత్రాలతో తమ భూముల వద్ద హాజరై, భూముల హద్దులను సర్వే బృందానికి చూపించి వివరాలు నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్, సర్వేయర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్లు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి- గోపవరం : మండలంలోని గోపవరం గ్రామం, సర్వే నెంబర్ 234లో ఉన్న సూరేపల్లి ప్లాట్లలో రోడ్డు ఆక్రమణకు గురైన నేపథ్యంలో ఆ స్థలంలోని అక్రమ కట్టడాలను తొలగించినట్లు తహశీల్దార్ త్రిభువన్ రెడ్డి తెలియజేశారు. శనివారం ఆయన స్వయంగా అక్రమ కట్టడాల తొలగింపును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారుల కోసం ఏర్పాటు చేసిన లేఔట్లలోని రహదారులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినట్లయితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెలవు దినాల్లో కూడా గోపవరం మండల పరిధిలోని ప్రభుత్వ భూములు, స్థలాలు ఆక్రమించినా లేదా జెసిబిలు తదితర యంత్రాలతో మట్టిని అక్రమంగా తరలించినా, సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

స్మార్ట్ కిచెన్లు పర్యవేక్షణ

ప్రజాశక్తి- చింతాకొమ్మదిన్నె : జడ్పి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్మార్ట్ కిచెన్‌ను శనివారం డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ రాజ్య లక్ష్మి, అధికారులు శనివారం సందర్శించారు. కిచెన్‌లో ఉన్న పరికరాలు, వంట విధానాలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీడీ సిబ్బందికి స్మార్ట్ కిచెన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిపిఎంలు లావణ్య, హరి ప్రసాద్, రఘునాథరెడ్డి, ఎజిఎం శ్రీనివాసులు, ఎపిఎంలు రమణ, రాజు పాల్గొన్నారు.

'సిటు' మహాసభలను జయప్రదం చేయాలని

కరపత్రాల ఆవిష్కరణ



పోరుమామిళ్ల : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

సిఐటియు 18వ ఆల్ ఇండియా మహాసభలు ఈనెల 31 నుంచి 2026 జనవరి 4 వరకు విశాఖపట్నంలో నిర్వహిస్తున్నారని, వీటిని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి మనోహర్ పిలుపునిచ్చారు. శనివారం సిఐటియు కార్యాలయంలో మహాసభల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఆల్ ఇండియా మహాసభలు నిర్వహించడం మొదటిసారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాల అవలంభించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని విమర్శించారు. మహాసభలలో దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి, భవిష్యత్తు ప్రణాళిక రూపొందిస్తారని పేర్కొన్నారు. చివరి రోజు 4వ తేదీ విశాఖలో పెద్ద ఎత్తున ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ ర్యాలీ, బహిరంగ సభను జిల్లాలో ఉన్న కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. **పోరుమామిళ్ల :** పోరుమామిళ్లలోని అంబేద్కర్ విగ్రహం ఎదటు సిఐటియు 18 వ అఖిలభారత మహాసభలు విజయవంతం చేయాలని ప్రచురించిన కరపత్రాలను సిఐటియు మండల నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. భైరవప్రసాద్, సిఐటియు నాయకులు ప్రకాష్, గౌసియాబేగం, ప్రకాష్, గురవయ్య, రాజు, రవి, వెంకటసుబ్బయ్య, సాయి, రత్నం, మహబూబ్ పేరా, రత్నమయ్య, హంద్రీయ, ఓబులమ్మ, మేరీ, బీబీ, ప్రమీల పాల్గొన్నారు **జమ్మలమడుగు :** విశాఖలో జరుగుతున్న సిఐటియు ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు కార్యదర్శి దాసరి విజయ్, అంగన్వాడీ యూనియన్ అధ్యక్షులు లక్ష్మీదేవి. కార్యదర్శి భాగ్యమ్మ పేర్కొన్నారు. శనివారం వారు స్థానిక పోస్ట్ ఆఫీస్ సచివాలయం ఆవరణంలో కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు లక్ష్మి కళ, సివి.రమాదేవి, అలేఖ్య, లక్ష్మీ కుమారి, సరస్వతి, మేరీ, హరిప్రియ, హసీనా, కార్మికులు పాల్గొన్నారు.

అప్పలరాజుపై పీడీ యాక్ట్ సిగ్గుచేటు : కెవిపిఎస్

ప్రజాశక్తి - కడప అర్బన్

రైతు సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం. అప్పలరాజుపై అక్రమంగా బనాయించిన పీడీ యాక్ట్ కేసును వెంటనే ఉపసంహరించి విడుదల చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శి సి.పి.రమణ, దాసరి నరసింహులు డిమాండ్ చేశారు. శనివారం కెవిపిఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై కృషి చేస్తున్న ఆయనపై తప్పుడు కేసులు బనాయించి చట్టవిరుద్ధంగా నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అప్పలరాజు అరెస్టుకు ఇచ్చిన అర్డర్లో 2013, మే నుంచి 2025, డిసెంబర్ 10 వరకు 19 కేసుల్లో నిందితునిగా పేర్కొన్నారని చెప్పారు. అందులో రెండు కేసులు నిర్దోషిగా తేల్చగా 12 కేసులు మూసి వేశారని పేర్కొన్నారు. మరో నాలుగు కేసులు దర్యాప్తులో ఉన్నాయని తెలిపారు. కేసుల్లో అత్యధిక భాగం 151 సెక్షన్ కేసులే ఉన్నాయని చెప్పారు. కార్పొరేట్ల లాభాల కోసం సముద్ర తీరాన్ని, పర్యావరణాన్ని విషతుల్యం చేస్తున్న ప్రభుత్వ ప్రయత్నాలను ఎండగడుతూ రాజ్యాంగం ప్రకారం వ్యవహరించాలని ప్రజలను చైతన్య పరుస్తూ సమీకరిస్తున్నారే తప్ప ఆయన ఏ రకంగాను ఎవరిపైనా గూండా గిరి చేయలేదని గమనించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్బంధ చర్యను ఖండిస్తూ, పిడి యాక్టు కేసును తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

గ్రామాలను చెత్తరహితంగా మార్చాలి

ప్రజాశక్తి- గోపవరం

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామీణ ప్రాంతాల పరిశుభ్రతను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ సురేష్ బాబు పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 27 నుంచి జనవరి 5 వరకు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. గ్రామాల్లో రోడ్డు పక్కల పేరుకుపోయిన పేడ కుప్పలు, చెత్త దిబ్బలను తొలగించి గ్రామాలను పూర్తిగా చెత్త రహితంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రోజూ చెత్తను సేకరించి శుభ్రపరిచి, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించనున్నామని చెప్పారు. సేకరించిన చెత్తను ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలకు తరలించి ఎరువుల తయారీ చేయనున్నామని తెలిపారు. జనవరి 5 న అన్ని గ్రామ పంచాయతీలలో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించి, చెత్త రహిత గ్రామ పంచాయతీలుగా తీర్మానాలు చేసి అధికారికంగా ప్రకటించనునామని పేర్కొన్నారు. ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ షెడ్లలో నీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

ప్రజాశక్తి - కడప : విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఆదివారం సెలవు దినం అయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యధావిధిగా పనిచేస్తాయని ఎస్ఇ ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక బిల్లును ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - కాశి నాయన

ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక బిల్లును ఉపసంహరించుకోవాలని జిల్లా ఆర్థిక కార్యదర్శి యు.సుబ్రమణ్యం ఒక ప్రటనలో పేర్కొన్నారు. 2004 సంవత్సరం నుంచి దేశవ్యాప్తంగా సిపిఎస్‌ను వ్యతిరేకిస్తూ ఉద్యోగులు ఎన్నో ఉద్యమాలు చేస్తున్నారన్నారు. యితే పులి మీద పుట్రల ఆర్థిక బిల్లు 2025 ద్వారా 2026 సంవత్సరం తర్వాత విమరణ చేసిన ఉద్యోగులకు మాత్రమే వేతన సవరణ కమిటీ సిఫారసును అమలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం పేర్కొందన్నారు. అంటే అంతకుముందు రిటైర్ అయిన అందరికీ వేతన సంవత్సర ప్రయోజనాలు కానీ, డిఎ పెంపుదల కానీ ఈ చట్టం ప్రకారం ఉండవు తెలిపారు. దీనివల్ల పెన్షన్లు మార్పు లేకుండా వృద్ధాప్యంలో ఆర్థిక ఇబ్బందులతో జీవితాన్ని గడిపే పరిస్థితులు దాపురిస్తాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఆలోచించి పెన్షన్ దారుల హక్కులను కాపాడాలన్నారు.

శారీరక దృఢత్వం అవసరం : సిఐ

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

విద్యార్థుల్లో మానసికతోపాటు శారీరక దృఢత్వం అవసరమని సిఐ హేమసుందర్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని మైదుకూరు రోడ్డులో ఉన్న శ్రీ వైష్ణవి సిబిఎస్‌సి హై స్కూల్‌లో క్రీడాపోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిఐ హాజరై పోటీలను ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలు మానసిక అభివృద్ధి వైపేగాక శారీరిక దృఢత్వం కోసం ప్రయత్నించాలని, అందుకోసం క్రీడల వైపు మక్కువ పెంచుకోవాలని చెప్పారు. క్రీడాపోటీలు నిర్వహిస్తున్న కరస్పాండెంట్ డాక్టర్. ఆర్.వి రామకృష్ణ, ప్రిన్సిపల్ కల్యాణిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలలోనూ ఎప్పుడు ముందుంటారని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థులు తమ ప్రతిభ చాటారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి కేశవ రాయుడు, వైస్ ప్రిన్సిపల్ నమిత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సిఐ హేమసుందర్‌రావు

గంజాయి మహమ్మారిని తరిమికొడదాం : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

గంజాయి మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టేందుకు ఉపాధ్యాయులు తమ వంతు పాత్రను పోషించాలని డిఇఒ షేక్. షంషుద్దీన్ పిలుపునిచ్చారు. శనివారం కడపలోని తన కార్యాలయంలో యుటిఎఫ్ రూపొందించిన 'భావి భారత పౌరులను గంజాయి బారి నుంచి కాపాడు కుందాం' అనే కరపత్రాలను డిఇఒ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి బారి నుంచి విద్యార్థులను, యువతను కాపాడటం ద్వారా రాష్ట్ర భవిష్యత్తును రక్షించుకుందామంటూ సామాజిక ఉద్యమం పేరుతో యుటిఎఫ్ కరపత్రాన్ని రూపొందించడం అభినందనీయమన్నారు. సమస్యలను, ఒత్తిళ్లను అధిగమించలేకపోవడం పోటీని తట్టుకోలేకపోవడం, కుటుంబాలలో భావోద్రేకాలను పంచుకునే స్వేచ్ఛ లేకపోవడం, ఆన్‌లైన్ గేమ్స్, సోషల్ మీడియా వ్యసనం, సైబర్ ప్రభావం వల్ల విద్యార్థులు, యువత ప్రత్యేక ఆనందం పేరుతో గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారన్నారు. గంజాయి నిరోధానికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నా దాని ప్రభావం రోజురోజుకు పెరగడమే కాకుండా ఆనందంగా గడుపుతున్న కుటుంబాల్లో కల్లోలాలను సృష్టిస్తున్నదని పేర్కొన్నారు. గంజాయి మహమ్మారి ఎంతోమంది యువకుల జీవితాలలో చీకటిని నింపి, వారి జీవితాలను నాశనం చేస్తున్నదన్నారు. గంజాయి వల్ల యువత విచక్షణ కోల్పోవడమే కాకుండా, సహనాన్ని కోల్పోయి సంఘ విద్రోహ శక్తులుగా మారిపోతున్నారన్నారు. విద్యార్థులు, యువత గంజాయి లాంటి మారక ద్రవ్యాల వైపు వెళ్లకుండా చైతన్య పరచడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ గంజాయి ప్రభావం రోజురోజుకు విపరీతంగా పెరిగిపోతుందన్నారు. ఒకప్పుడు ఎక్కడో చాటు మాటుగా సాగిన గంజాయి ప్రయాణం నేడు పాఠశాల పరిసరాల వరకు వచ్చి చేరిందన్నారు. విద్యార్థులు, యువత గంజాయికి బానిసలుగా మారి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. గతంలో సిగరెట్ రూపంలో మాత్రమే లభించే గంజాయి నేడు చాక్లెట్స్ రూపంలో పాఠశాలలు, కళాశాలల వద్ద దొరకడం తీవ్రమైన ప్రమాదానికి సంకేతమన్నారు. విద్యార్థులను, యువతను టార్గెట్ చేసి తమ సామ్రాజ్యాన్ని మరింత విస్తరించే పనిలో గంజాయి ముఠాలు వ్యవహరిస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. గంజాయి నిరోధానికి యుటిఎఫ్ తన వంతు పాత్రను పోషిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఎస్.ఎజాస్ అహ్మద్, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రవి ప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి ఎబినేజర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బి.పరిమళ జ్యోతి పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డిఇఒ

నిరసనల హోరు

ప్రజా'దృష్టి'

జిల్లాలో నిరసనల హోరు కొనసాగుతోంది. రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాలను కడప జిల్లాలో కలపాలని, రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని, ఎన్‌హెచ్ నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ నిరసనలు, నిరాహార దీక్షలు హోరెత్తుతున్నాయి. వైసిపి హయాంలో అశాస్త్రీయంగా జిల్లాలను విభజించారనే పేరిట కూటమి నాయకత్వం శాస్త్రీయత ఆధారంగా జిల్లాలను విభజిస్తామని హామీనిచ్చింది. కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. కేబినెట్ సబ్ కమిటీ జిల్లాల్లో పర్యటించింది. కూటమి నాయకులైన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ అమలు మేరకు మదనపల్లిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాజంపేటను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని విస్మరించడంపై రాజంపేట, రైల్వేకోడూరు అసెంబ్లీల నియోజకవర్గ వ్యాప్తంగా నిరసనలు, నిరాహార దీక్షల పరంపర కొనసాగుతోంది. తాజాగా కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి అసెంబ్లీలను మూడు ప్రాంతాలుగా విభజిస్తే ఎలా ఉంటుందనే కోణంలో ఆలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ప్రత్యామ్నాయాలు ఆలోచించడం అవాంఛనీయమని గ్రహించాలి. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో టిడిపి జిల్లా కార్యవర్గాన్ని ఏర్పాటు చేసింది. టిడిపి జిల్లా అధ్యక్షులుగా ఆర్.శ్రీనివాసరెడ్డి, భూపేష్‌రెడ్డి పోటీదారులుగా నిలిచిన సంగతి తెలిసిందే. ఐవిఆర్ఎస్ సర్వే, కార్యకర్తల అభిప్రాయాల పేరుతో నెలల తరబడి నానబెట్టిన అనంతరం జమ్మలమడుగుకు చెందిన సి.భూపేష్‌రెడ్డి, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులుగా సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు నియామకాలపై ఉత్సాహం సన్నగిల్లిందని చెప్ప వచ్చు. అన్నమయ్య జిల్లా చిన్నమండెం, రాయచోటి ఘాట్ ప్రాంతాల్లో తరుచుగా ప్రమాదాలు వాటిల్లడం తెలిసిందే. శనివారం తెల్లవారుజామున రాయచోటి నియోజకవర్గ పరిధిలోని చినమండెం మండల కేంద్రం సమీపంలో కారును అంబులెన్స్ ఢీకొన్ని ఘటనలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మృతి చెందడం ఆందోళన కలిగించింది. నేషనల్ హైవే అధికారులు సంబంధిత ప్రమాదకర ప్రాంతాల్లో సైన్‌బోర్డులు, మద్యపాన డిటెక్టర్లు, స్పీడ్ మీటర్లు ఏర్పాటు, మెర్క్యూరీ లైటింగ్ తదితర ప్రమాద నివారణ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో సంక్రాంతి, నూతన సంవత్సర వేడుకలు, ఇతర ఉత్సావాలకు హాజ రు కావాలనే ఉద్దేశంతో దేశం నలుమూలల నుంచి స్వగ్రామాలకు బయల్దేరిన యువతను ప్రమాదాలు కబళించడం గ్రామాలను విషాదఛాయల్లో ముంచెత్తడం విచారకరమని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రహించాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



రైతులతో ర్యాలీ నిర్వహిస్తున్న తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి

రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం ఉంటుందని తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టే భూ రీసర్వే ప్రక్రియపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు శనివారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో వేంపల్లెలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించేందుకు రైతుల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ చేపట్టామన్నారు. రీ సర్వే వల్ల భూమి హద్దులను స్పష్టంగా నిర్ణయించనున్నట్లు తెలిపారు. భూ వివాదాలకు చెక్కు పెట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి రైతు తన భూమికి సంబంధించిన పత్రాలను సిద్ధంగా పెట్టుకొని రెవెన్యూ అధికారులకు సహకరించాలని కోరారు. ర్యాలీలో ఆర్ఐ లోకేష్, టిడిపి యువ నాయకుడు సింగారెడ్డి శివకృష్ణారెడ్డి, నల్లమేకల రామాంజనేయులు, సింగారెడ్డి చిన్న ఓబుళరెడ్డి, డీలర్ నాగిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎఇఒ అభిలాష్‌రెడ్డి

పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రబీ సీజన్‌లో సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ ఎఇఒ అభిలాష్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని అంకాలమ్మ గూడూరు, గురజాల గ్రామాల్లో జరుగుతున్న పంట నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఇఒ మాట్లాడుతూ సాగు చేసిన పంటను నమోదు చేయించుకోవాలన్నారు. దీనివల్ల ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల ప్రోత్సాహకాలు అందుతాయన్నారు. క్షేత్రస్థాయిలోని సిబ్బందికి రైతులు సహకరించి, పంట నమోదు చేసుకోవాలని కోరారు

అందుబాటులో 20 టన్నుల యూరియా : ఎఒ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని లోమడ, కోరగుంటపల్లె రైతు సేవా కేంద్రాల్లో యూరియా 20 టన్నులు అందుబాటులో ఉందని మండల వ్యవసాయ శాఖ ఇన్‌ఛార్జి అధికారి రామాంజనేయరెడ్డి, ఎఇఒ అభిలాష్‌రెడ్డి తెలిపారు. రైతుల అవసరాల మేరకు యూరియాను అందుబాటులో ఉంచామన్నారు. బయట ఎరువుల దుకాణాలలో ఎమ్మార్పీ ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూరియాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.


మాట్లాడుతున్న గంగా రూరల్ ఎన్విరాన్మెంట్ సంస్థ అధ్యక్షుడు శివకృష్ణ

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రతి విద్యార్థి సత్ప్రవర్తన, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరాలని పశుసంవర్ధక ఎడి రవీంద్రనాథ్‌రెడ్డి, గంగా రూరల్ ఎన్విరాన్మెంట్ సంస్థ అధ్యక్షుడు శివవృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఉర్దూ రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం నేటి తరం యువతలో స్ఫూర్తి నింపడానికి అనే అంశంపై శివకృష్ణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువతరం ఆత్మ విశ్వాసం కలిగి ఉండాలని కోరారు. భవి ష్యత్తు తరాలకు బాసటగా విద్యార్థులు నిలవాలన్నారు. తల్లిదండ్రులను పూజిం చాలని, గురువులను గౌరవించాలని సూచించారు. చెడు అలవాట్లుకు లోనైతే భవిష్యత్తు అంధకారం అవుతుందని తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని సూచించారు. ఉన్నత విద్యాభ్యాసం చేసేందుకు పేద విద్యార్థులకు ఆర్థికసాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్ పాఠశాల కరస్పాండెంట్ కేశవులు, ఉర్దూ రెసిడెన్షియల్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఇఒ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రాజుపాలెం ఎంఇఒ కార్యాలయ పరిసర ప్రాంతంలో శనివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఆవరణలో మొక్కలు నాటేందుకు గుంతలు తీశామని కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ మునెయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎంఇఒ ప్రసాద్ మాట్లాడుతూ అయిదు రోజులుగా పలు కార్యక్రమాలను చేపట్టిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మౌనయ చారి, ఎంపీడీఓ రమణ రెడ్డి, నంద్యాల నాగభూషణం, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



ఎంఇఒ కార్యాలయ ఆవరణలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

ఆశాజనకంగా బుడ్డశనగ సాగు

పులివెందుల నియోజకవర్గంలో దాదాపు 38 వేల ఎకరాల్లో సాగు - ఆశించిన మేర పూత

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఆశాజనకంగా బుడ్డ శనగ పంట ఉందని రైతుల అంటున్నారు. రబీలో సాగు చేసిన బుడ్డ శనగకు పూత బాగా రావడంతో దిగుబడి పూర్తి స్థాయిలో వస్తుందని రైతుల్లో సంతోషం కనిపిస్తోంది. పులివెందుల నియోజకవర్గంలో దాదాపు 38 వేల ఎకరాల్లో బుడ్డశనగ సాగు చేశారు. అత్యధికంగా సింహాద్రిపురం మండలంలో సుమారు 15 వేల ఎకరాల్లో, లింగాలలో 9 వేల ఎకరాలలో, తొండూరులో 5 వేల ఎకరాలలో, పులివెందులలో 2 వేల ఎకరాలలో, వేముల మండలంలో 3 వేల ఎకరాలలో, వేంపల్లి మండలంలో 3 ఎకరాలలో బుడ్డశనగ సాగు చేశారు. రూ.వేలాది వెచ్చించి పంట సాగు చేశారు. పంట చేతికొచ్చే సమయంలో ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించకపోతే మంచి దిగుబడి వస్తుందని, అప్పులు తీరుతాయని రైతులు చెబుతున్నారు.


సాగులో ఉన్న బుడ్డ శనగ

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం : ఎస్ఇ


సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో ఎస్ఇ రమణ, అధికారులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే విద్యుత్ శాఖ లక్ష్యమని ఆ శాఖ ఎస్ఇ రమణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని సుంకేసులలో 33 /11 కెవి సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ అందించడంలో భాగంగా నూతన సబ్‌స్టేషన్‌లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగానికి నిరం తరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. గ్రామాల్లో కూడా చిన్న పరిశ్రమలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఆర్డిహెచ్ఎస్ ద్వారా త్రి ఫేస్ సరఫరాను ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులకు సంబంధించి వ్యవసాయ మోటర్లకు దరఖాస్తు చేసుకున్న వెంటనే సర్వీసు ఇస్తామన్నారు. క్షేత్ర స్థాయిలోని సిబ్బంది రైతులకు, వినియోగదారులకు నిరంతరాయంగా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని ఎస్ఇ సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డిఇ ప్రసాద్‌రెడ్డి, ఎడిఇ జయ సుధాకర్‌రెడ్డి, ఎంఆర్‌టి డిఇ రమేష్, ఎడిఇ ఈశ్వరయ్య, ఎఇ వీరయ్య, ఎఇ దినేష్‌కుమార్, మండలంలోని విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాట్‌పై విద్యార్థులకు నిపుణుల సూచనలు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ఐటి క్యాంపస్‌లో దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయస్థాయి ప్రవేశ పరీక్ష కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్)పై శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ క్యాట్ 100 పర్సెంటైల్ శిక్షణ సంస్థ సహకారంతో ఉన్నత విద్య, పోటీ పరీక్షల విభాగపు అధికారి డాక్టర్ డి.కోనప్ప ఆధ్వర్యంలో 100 పర్సెంటైల్ శిక్షణ సంస్థ నిపుణులు కిషోర్ కుమార్ విద్యా ర్థులకు సూచనలిచ్చారు. కామన్ అడ్మిషన్ టెస్ట్ భారత దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయస్థాయి ప్రవేశ పరీక్ష అన్నారు. కామన్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధిస్తే అభ్యర్థులకు అగ్రశ్రేణి మేనేజ్‌మెంట్ సంస్థలలో ప్రవేశించడానికి వీలు కల్పిస్తుందన్నారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ విద్యార్థులు ఒక కంపెనీలో ఉద్యోగిగా కాకుండా కంపెనీకే ప్రాతినిధ్యం వహించేలా తయారవుతారని చెప్పారు. ఎంబిఎ, పిజిడిఎం కోర్సుల ప్రవేశానికి నిర్వహించే క్యాట్ పరీక్ష సరళితోపాటు వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ ఎబిలిటీ, అర్థమెటిక్, ఆల్జీబ్రా వంటి ముఖ్యమైన అంశాలపై ప్రశ్నలతీరు ఎలా ఉంటుందో, వాటిని ఎలా సాధించాలో మాక్ టెస్టుల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మాక్ టెస్టు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 100 పర్సెంటైల్ శిక్షణ సంస్థ వారిచే ఉచిత శిక్షణ అందిస్తామని కిషోర్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో డీన్ అకాడమీ రమేష్ కైలాష్, శిక్షణ సంస్థ ప్రతినిధులు రామకృష్ణ, ట్రిపుల్ఐటి అధికారులు, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో క్యాట్ శిక్షణ సంస్థ ప్రతినిధులు, అధికారులు

బడ్జెట్ సమావేశాన్ని నిమిషాల్లో ముగించడంలో ఆంతర్యమేమిటో?

- కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్‌బాషా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్‌లో శనివారం నిర్వహించిన రూ.100కోట్ల బడ్జెట్ సమావేశాన్ని కొన్ని నిమిషాల్లో ముగించడంలో ఆంతర్యమేమిటని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్‌బాషా ప్రశ్నించారు. కౌన్సిల్ సమావేశంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10.30నిమిషాలకు ప్రారంభమైన సమావేశం చైర్‌పర్సన్ సభలో కూర్చున్న వెంటనే బడ్జెట్ ఆమోదమైందని ప్రకటించి ముగించడం ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడిచినట్లేనని తెలిపారు. మున్సిపాలిటీ ఆదాయం, వ్యయం, నిధుల వినియోగం, నిల్వలు, రాబడులు వంటి అంశాలపై సుదీర్ఘంగా జరగాల్సిన సమా వేశాన్ని, కేవలం కొద్ది మంది సభ్యులతో హుటా హుటిన నిర్ణయం తీసుకోవడం ఏరాజ్యాంగ హక్కు అని ఆయన ప్రశ్నించారు. మున్సిపాలిటీని కుటుంబ వ్యాపా రంగా మార్చారని ఆరోపించారు. అధికార, ప్రతిపక్ష పార్టీ ఇరువురు కూడా మౌనం పాటిస్తూ ఇలాంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు మద్దతుగా నిలుస్తున్నారని ఆగ్రహించారు. ప్రొద్దుటూరు పట్టణ అభివృద్ధిపై, పురపాలక సంఘ నిధులపై చిత్తశుద్ధి ఉంటే రూ.100 కోట్ల బడ్జెట్‌ను కొద్ది నిమిషాల్లో ఎలా ఆమోదిస్తారని నిలదీశారు. పెట్రోల్ బంక్ వ్యవహారంలో అవినీతి జరిగిందని సాక్షాత్తు కమిషనర్ నిర్ధారించినప్పటికీ 2022 నుంచి ఇప్పటివరకు జరిగిన క్రెడిట్ కార్డుల కమీషన్లపై ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. శనివారం సమావేశం నామమాత్రంగా జరగడం వెనుక ప్రజల దృష్టిని మళ్లించాలని రాజకీయ దశ్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రొద్దుటూరు ప్రజలకు సమా ధానం చెప్పే ధైర్యం లేక ఇలా నిమిషాల్లోనే సభను ముగించారని ఆయన ఆరోపించారు. ఇలాంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అవసరమైతే ఉద్యమాలకు కూడా సిద్ధమని హెచ్చరించారు. సమావేశాన్ని కొద్ది నిమిషాల్లోనే ముగించడం ప్రజాస్వామ్యానికి అవమానమని, ప్రొద్దుటూరు ప్రజలు దీనికి తగిన సమాధానం కోరుతున్నారని ఇర్ఫాన్‌బాషా స్పష్టం చేశారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్.వరదరాజుల రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రభుత్వం నుంచి మంజూరైన రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ఇల్లులేని ప్రతి పేదవానికి ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. రెవెన్యూ సమస్యలపై ప్రజలకు త్వరితగతిన పరిష్కారం చేయాలని తహశీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్య నారాయణరెడ్డి, తహశీల్దార్ గంగయ్య, మండల ఇన్‌ఛార్జి అధ్యక్షుడు, గోపవరం ఎంపీటీసీ దస్తగిరిరెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలమని ఎమ్మెల్యే ఎన్. వరదరాజులరెడ్డి తెలిపారు. పట్టణంలోని కొర్రపాడు రోడ్డులో ఉన్న శివశంకర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో పునర్జీవ ఆర్గానిక్స్ షాప్‌ను శనివారం పునర్జీవ ఆర్గానిక్ సంస్థ వ్యవస్థాపకులు రామ్మోహన్‌రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్ర ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి పాల్గొన్నారు. ప్రొద్దుటూరు ప్రజానీకానికి ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను అందజేయడం శుభప్రదమన్నారు. ప్రజలు రసాయనిక, క్రిమిసంహారక అవశేషాలు లేని ఆహార ఉత్పత్తులను వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పునర్జీవ ఆర్గానిక్ సంస్థ వ్యవస్థాపకులు రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల సారవంతమైన నేలల నుంచి సేకరించిన సమృద్ధి పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహార ఉత్పత్తులు, రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక అవశేషాలు లేని ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను సమాజానికి అందజేయడమే తమ సంస్థ ధ్యేయమన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులు అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రసానికి ఎరువులు, క్రిమిసంహారక మందులు విచక్షణారహితంగా వాడడం వల్ల మానవాళి మనగడకే ముప్పు ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది, తహశీల్దార్ గంగయ్య పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

పట్టణంలోని విజయ్ కుమార్ సర్కిల్‌లో ఉన్న అన్నా క్యాంటీన్‌ను శనివారం సామాన్యుడిలా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సం దర్శించారు. మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు చల్లా రాజ గోపాల్ యాదవ్ అల్పాహారం స్వీకరించారు. ఈ సం దర్భంగా వారు అన్నా క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను అభినం దించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కడప జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వై.ఎస్.జబీబుల్లా, శ్రీఅగస్త్యేశ్వర స్వామి ఆలయ చైర్మన్ వంగల నారాయణరెడ్డి, టీడీపీ రాజుపాలెం మండలం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కొత్తపల్లె పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి, యోగివేమన ఇంజినీరింగ్ కళాశాల నాన్ టీచింగ్ యూనియన్ అధ్యక్షులు రసూల్ గౌస్ పాల్గొన్నారు.


అల్పాహారం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, టిడిపి పట్టణాధ్యక్షులు చల్లా రాజగోపాల్

జనాభా పెంపు అనర్థదాయకం : తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

దేశానికి జనాభానే ఆస్తి, ప్రతి జంట ముగ్గురు పిల్లలను కనాలని తిరుపతిలో జరిగిన భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం సమంజసం, సమర్థనీయం కాదని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి తెలిపారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచంలో 242 దేశాలు ఉండగా జనాభా 809 కోట్లు ఉందన్నారు. ఇందులో భారతదేశపు జనాభా 144 కోట్లు ఉందన్నారు. ప్రపంచ దేశాలలో భారతదేశం ఇప్పటికే జనాభాలో నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. ఇప్పటికే జనాభాలో చైనాను మించి పోయినట్లు తెలిపారు. చైనా జనాభా 142 కోట్లతో రెండవ స్థానంలో నిలవగా మూడవ స్థానంలో ఉన్న అమెరికా జనాభా కేవలం 34 కోట్లు మాత్రమే అన్నారు. ప్రపంచ జనా భాలో భారతదేశపు జనాభా 18 శాతం కాగా ప్రపంచ భూభాగంలో భారత దేశపు భూభాగం కేవలం 2.4 శాతం మాత్రమే ఉందన్నారు. ఇప్పటికే భారతదేశం జనాభాతో కిక్కిరిస్తున్నట్లు చెప్పారు. యువత ఉపాధి, ఉద్యో గాలు లేక అసాంఘిక శక్తులుగా తయారైందన్నారు. ఇప్పటికైనా జనాభా విషయంలో చంద్రబాబు, ఆర్ఎస్ఎస్ నాయకులు పునరాలోచించాలని సూచించారు.


హాజరైన సభ్యులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న చైర్మన్ వరప్రసాద్

మున్సిపాలిటీలో సమస్యల్లేకుండా చూడాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీలో ఎక్కడా సమస్యల్లేకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో యూజీడీ, వీధిలైటు నిర్వహణ, మంచినీటి సమస్య లేకుండా చూడాలన్నారు. మున్సిపల్ అధికారులు కూడా కౌన్సిలర్లు చెప్పిన వెంటనే స్పందించి వాటి పరిష్కారానికి చొర తీసుకోవాలన్నారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. బ్రాహ్మణపల్లె గ్రామంలో వీధిలైటు నిర్వహణ, యుజిడి సమస్యలు ఉన్నాయని ఆ వార్డు కౌన్సిలర్ మహేష్‌రెడ్డి తెలిపారు. బాకరాపురంలో వీధిలైట్లకు స్విచ్ లేక దాదాపు 20 లైట్లు ఇబ్బందిగా ఉన్నాయన్నారు. వెంటనే వాటికి స్విచ్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో వీధిలైట్ల నిర్వహణలో సిబ్బందికి ఇబ్బందికరంగా ఉంటే తానే కరెంటు పోల్ ఎక్కి వీది లైట్లు ఏర్పాటు చేస్తానని అనడంతో అధికారులు వెంటనే స్పందించారు. వీధి లైట్లు ఏర్పాటు చేస్తామని మున్సిపల్ కమిషనర్ రాముడు కౌన్సిలర్ దృష్టికి తెచ్చారు. మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న వివిధ పనులను పరిష్కరించేందుకు కౌన్సిల్ ఆమోదముద్ర చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతోపాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు.


కార్యదర్శికి వినతిపత్రమిస్తున్న అనంతరపురం గ్రామప్రజలు

అనంతపురం గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలి

ప్రజశక్తి - చాపాడు

నూతన గ్రామ పంచాయతీల మార్పుల్లో భాగంగా తిప్పిరెడ్డిపల్లె గ్రామంలో శనివారం పంచాయతీ కార్యదర్శి నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ ఓబాయపల్లె గ్రామ పంచాయతీ నుంచి తిప్పిరెడ్డిపల్లె, అనంతపురం గ్రామాలను వేరు చేస్తూ నూతన పంచాయతీ ఏర్పాటుకు అభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రభుత్వం నూతనంగా తిప్పిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదన చేయగా స్థానికులు అనంతపురం గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో కూడా అనంతపురం రెవెన్యూ గ్రామంగా ఉండేదన్నారు. ఎన్. ఓబాయపల్లెలో గ్రామసభ నిర్వహిం,గా తిప్పిరెడ్డిపల్లె, అనంతపురంను ఉమ్మడి గ్రామంగా కొనసాగించాలని ప్రజలు అభిప్రాయపడ్డారు. అన్నవరం పంచాయతీలోని వెంగన్నగారిపల్లెను దువ్వూరు మండలంలోని చిన్న అగ్రహారంలోకి మార్పు చేయాలని ప్రజలు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

రోడ్డు నిర్మాణాన్ని నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని భద్రిపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ చందా పార్వతీ ఇంటి వద్ద ఉపాధి హమీ నిధుల ద్వారా సిమెంట్ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. శనివారం బండల చప్పటను తీసేయడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రస్తుతం సిమెంట్ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన స్థలంలో రోడ్డు వేయవద్దని కోర్టులో పిటీషన్ వేశామని రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈ రస్తాలో ఇతరులు నడిచేందుకు హక్కు లేదని, సిమెంట్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు లేకుండా నిలిపివేయాలని కోరారు. దౌర్జన్యంగా బండల చప్పటను తీసేయడం అన్యాయమని తెలిపారు.


మాజీ సర్పంచ్ ఇంటి వద్ద తొలగించిన బండల చప్పట



విజేతలతో చైర్మన్, డైరెక్టర్ శివశంకర్ రెడ్డి శ్రీదేవి

ఉత్సాహంగా స్పోర్ట్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్

నాగార్జున మోడల్ స్కూల్ రామరాజు పల్లె బ్రాంచ్‌లో స్పోర్ట్స్ స్పెక్ట్రా పేరుతో క్రీడా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం విద్యా సంస్థల చైర్మన్ ఎం. శివశంకర్ రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని చైర్మన్, డైరెక్టర్ ఆవిష్కరించారు. ఒలంపిక్స్ తరహాలో క్రీడాజ్యోతిని చైర్మన్ వెలిగించారు. స్పోర్ట్స్ డే ప్రారంభ సూచికగా తెల్ల పావురాలను గాలిలోకి ఎగురవేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి సర్వతో ముఖాభివృద్ధికి క్రీడలు తప్పనిసరి అన్నారు. శారీరక దృఢత్వంతోనే మానసిక స్థిరత్వం ఏర్పడుతుందని పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో చదువుతో పాటు క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తి, నాయకత్వ లక్షణం, సమయపాలన లక్షణాలు అలవాడాలంటే క్రీడలు అవసరమన్నారు. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి పెంచాలని ఉద్దేశంతోనే ప్రతి ఏడాది క్రీడా దినోత్సవం నిర్వహిస్తు న్నామని తెలిపారు. విద్యార్థుల క్రీడా స్ఫూర్తిని చైర్మన్, డైరెక్టర్ కొని యాడారు. ప్రిన్సిపల్ అరుణ, హెడ్ మాస్టర్ వీర శివ, స్కూల్ ఇన్‌ఛార్జి అబ్దుల్లా విజే తలను సత్కరించారు. విద్యార్థుల విన్యాసాలు ఆహుతులను అమితంగా ఆకట్టుకున్నాయి. మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తూ ముఖ్యఅతిథికి గౌరవ వందనం చేశారు. విజేతలకు విక్టరీ స్టాండ్ సత్కరించారు.